అమెరికా విద్యార్థి వీసాలు
మళ్లీ ప్రారంభం

- ఇంటర్వ్యూల షెడ్యూలింగ్ తిరిగి ప్రారంభించిన అమెరికా
- సోషల్ మీడియా వెట్టింగ్ తప్పనిసరి

న్యూఢిల్లీ: అమెరికాలో విద్యాభ్యాసం కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులకు అమెరికా శుభ వార్త చెప్పింది. ఇటీవల తాత్కాలికంగా నిలిపివేసిన ఇంటర్వ్యూ షెడ్యూలింగ్‌ను మళ్లీ ప్రారంభించింది. అయితే సోషల్‌మీడియా వెట్టింగ్‌ను తప్పనిసరి చేసింది. ప్రభుత్వ రివ్యూ కోసం విద్యార్థులు తమ సోషల్ మీడియా ఖాతా వివరాలు ఇవ్వాల్సి ఉంటుందని అమెరికా విదేశాంగ శాఖ తెలిపింది. అమెరికా, అమెరికా ప్రభుత్వం, సంస్థలు, సంస్కృతి, విలువలకు వ్యతిరేకంగా విద్యార్థులు ఏమైనా పోస్టులు పెట్టారా అన్నది పరిశీలించనున్నట్టు పేర్కొన్నది. సోషల్ ఖాతాల

పరిశీలనకు అనుమతించని వారి దరఖాస్తులను తిరస్కరిస్తామని స్పష్టంచేసింది. ఈ ఏడాది మే చివరి వారం నుంచి ప్రపంచవ్యాప్తంగా అమెరికా విద్యార్థి వీసా ఇంటర్వ్యూలను తాత్కాలికంగా నిలిపివేసిన విషయం తెలిసిందే. వీసా ఇంటర్వ్యూల పునరుద్ధరణ కోసం విద్యార్థులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. తాజా నిబంధనల ప్రకారం దరఖాస్తుదారులు తమ సోషల్ మీడియా హ్యాండిల్స్ వివరాలను కాన్సులేట్ అధికారులకు తప్పనిసరిగా అందజేయాలి. ఈ నేపథ్యంలో దరఖాస్తుదారులకు వచ్చే కొన్ని సందేహాలకు నిపుణులు సమాధానాలిచ్చారు.

ఈ పరిశీలన దరఖాస్తుదారులందరికీ వర్తిస్తాయా?

ఎఫ్-1 (స్టూడెంట్ వీసా) లాంటి నాన్-ఇమ్మిగ్రెంట్ వీసాలన్నింటికీ(ఎఫ్, ఎమ్, జె విభాగల వీసాలకూ) ఈ నిబంధన వర్తిస్తుంది. గత అయిదేండ్లుగా దరఖాస్తుదారు తాను ఉపయోగించిన సోషల్ మీడియా హ్యాండిల్స్‌ను దరఖాస్తులో పేర్కొనాలి.

అమెరికా ప్రభుత్వం ఈ సమాచారాన్ని ఎందుకు కోరుకుంటున్నది?

వ్యక్తుల సోషల్ మీడియా పోస్టులు వారి ప్రవర్తనను, ఆలోచనలను, భాగస్వామ్యాలను తెలియజేస్తుంది.

కాన్సులేట్ అధికారులు పరిశీలించే సోషల్ మీడియా ఖాతాలేవి?

ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, లింక్డ్‌ఇన్, రెడ్డిట్, టిక్‌టాక్, స్నాప్‌చాట్, పింటరెస్ట్, టంబ్ల్, డబన్(చైనా) లాంటి 20 ప్రముఖ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఖాతాలు. (గమనిక - ఈ జాబితా సమయానుగుణంగా మారొచ్చు.)

నేను ఆన్‌లైన్‌లో చేసిన పోస్టుల గురించి దిగులు చెందాలా?

మీరు చేసిన పోస్టులు చక్కగా, రాజకీయేతర అంశాల గురించి ఉంటే ఇబ్బందేమీ ఉండకపోవచ్చు. అయితే మీ పబ్లిక్ పోస్టులను సమీక్షించుకోవడం మంచిది. అయితే గతంలోని పోస్టులను దాచి పెట్టడానికి, తప్పుగా చూపడానికి ప్రయత్నం చేయొద్దు. పాత పోస్టులను తొలగించొద్దు. దరఖాస్తు సమీక్ష సమయంలో మీ సోషల్ మీడియా ప్రొఫైల్‌ను పబ్లిక్ అందరికీ కనిపించేలా పెట్టాలి.

సోషల్ మీడియా వెట్టింగ్ అంటే ఏమిటి?

ఓ వ్యక్తి సోషల్ మీడియా ఖాతాలను, అతడి పోస్టుల వెనుక ఉన్న ఉద్దేశాలను పరిశీలించడం. అమెరికా ప్రజలు, సంస్కృతి, ప్రభుత్వం, సంస్థలు, ఆ దేశ సిద్ధాంతాలకు వ్యతిరేక భావనలు దరఖాస్తుదారులో ఉన్నాయేమోనని యూఎస్ స్టూడెంట్ వీసా ఇంటర్వ్యూలో పరిశీలిస్తారు.

పాస్‌వర్డ్‌లు పంచుకోవాలా?

లేదు. కేవలం యూజర్ నేమ్స్, హ్యాండిల్స్ వివరాలు మాత్రమే ఇవ్వాలి.

నేను ప్రస్తుతం ఉపయోగించని ఖాతాల వివరాలూ ఇవ్వాలా?

అవును. మీరు తొలగించిన, యాక్టివ్‌లో లేని, వాడని సోషల్ మీడియా ఖాతాల వివరాలు కూడా ఇవ్వాలి. ఉద్దేశపూర్వకంగా వాటి వివరాలు పేర్కొనకపోతే తప్పుడు వివరాలు ఇచ్చినట్టు పరిగణించే ప్రమాదం ఉంటుంది.

రెండు ఖాతాలు ఉపయోగిస్తుంటే, రెండింటి వివరాలు ఇవ్వాలా?

అవును. నకిలీ ఖాతా వివరాలను ఇస్తే వాటిని తప్పించుకొనే ప్రయత్నంగా పరిగణించవచ్చు.

దరఖాస్తుదారుల వ్యాపార, సంస్థల సోషల్ మీడియా ఖాతాల వివరాలు ఇవ్వాలా?

లేదు.

క్షణం క్షణం.. భయం భయం!

- యుద్ధం వల్ల ఇజ్రాయెల్‌లో తెలంగాణ బిడ్డలకు ఇక్కట్లు
- రాత్రయితే చాలు అలర్ట్ మెసేజ్‌లు, సైరన్ చప్పళ్లతో నిద్రలేమి
- తింటున్న అన్నం వదిలేసి బంకర్లలోకి పరుగులు

ఓ బంకర్‌లో ఇజ్రాయెల్ వాసులతో కలిసి తల దాచుకున్న తెలంగాణ వాసులు

మెట్రోస్టేషన్‌లో పడుకున్న తెలంగాణ వాసులు

మోర్తాడ్, జూన్ 19: ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధ నేపథ్యంలో.. ఉపాధి కోసం ఇజ్రాయెల్‌కు వలస వెళ్లిన తెలంగాణ బిడ్డలు ప్రాణభయంతో విలవిల్లాడుతున్నారు. ఎక్కడినుంచి ఏ బాంబు దూసుకొస్తుందో తెలియక భయం భయంగా కాలం వెళ్లదీస్తున్నారు. వారం రోజులుగా రెండు దేశాలు వందలాది క్షిపణులతో పరస్పరం దాడులు చేసుకుంటున్న తరుణంలో తెలుగు ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకుంటున్నారు. ఉపాధి కోసం తెలంగాణ నుంచి సుమారు 800 మంది వరకు ఇజ్రాయెల్ వెళ్లారు. అందులో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి దాదాపుగా 200 మంది ఉన్నారు. వీరంతా ఇజ్రాయెల్‌లోని టెల్‌అవీవ్ పట్టణంలోని రమాద్గాన్ అనే ఏరియాలో ఉంటున్నారు. అయితే, గత 20 ఏండ్లుగా ఎప్పుడూ చూడని పరిస్థితిని ఇప్పుడు ఎదుర్కొంటున్నామని ఇజ్రాయెల్‌లో ఉంటున్న తెలంగాణబిడ్డలు వాపోతున్నారు. ఈ స్థాయిలో బాంబుల దాడులు, క్షిపణుల దాడులు ఎన్నడూ చూడలేదని చెప్తున్నారు.

రాత్రి వేళ బంకర్లలో..

రోజంతా పనులు చేసుకుంటున్నప్పటికీ సాయంత్రమైందంటే పరిస్థితి ఎట్లా ఉంటదో తెలియట్లేదని, ఎప్పుడు తింటున్నామో, ఎప్పుడు నిద్రిస్తున్నమో తెలియడం లేదని ఇజ్రాయెల్‌లో ఉంటున్న తెలంగాణవాసులు ఆందోళన చెందుతున్నారు. సాయంత్రమైందటే చాలు అలర్ట్ మెసేజ్‌లు, సైరన్ చప్పుళ్లతో భయాందోళనకు గురవుతున్నారు. బంకర్లలోకి వెళ్లి తలదాచుకుంటున్నారు. టెల్‌అవీవ్ పట్టణంలోని మెట్రో రైల్వేస్టేషన్ వద్ద భూగర్భంలో నిర్మించిన మూడో ఫ్లోర్ బంకర్లలో వేలాది మంది రాత్రుల్లో తలదాచుకుంటున్నారు. తెల్లవారి బయటకు వచ్చి తమ పనులు చేసుకుంటున్నారు. వారం రోజులుగా ఇదే పరిస్థితి కొనసాతున్నదని అక్కడే ఉంటున్న నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లికి చెందిన దేవరాజ్ తెలిపారు. యుద్ధ వాతావరణం కారణంగా సరైన భోజనం, ప్రశాంతమైన నిద్ర కూడా లేకుండా పోయాయని వాపోయారు.

అలర్ట్ మెసేజ్‌లతో బంకర్లలోకి..

ఇజ్రాయెల్‌లో బాంబులు, క్షిపణుల దాడులు జరగడానికి 10 నిమిషాల ముందే.. అక్కడి పౌరుల ఫోన్లకు అలర్ట్ మెసేజ్ వస్తుంది. దాంతో అక్కడ ఉన్నవారంతా తమకు సమీపంలో ఉన్న బంకర్లలోకి వెళ్లి తల దాచుకుంటారు. బాంబు పడే ముందు వచ్చే సైరన్‌ను విని బంకర్‌లోకి వెళ్లడం, దాడి జరిగిన అనంతరం తిరిగి బయటకు రావడం ఇప్పుడు ఇజ్రాయెల్‌లో సాధారణంగా మారింది. మెసేజ్ అలర్ట్ వచ్చిందంటే చాలు పది నిమిషాల్లోపు బంకర్లలోకి వెళ్లాలి. ఈ పరిస్థితుల్లో గత కొన్నేండ్లుగా ఇజ్రాయెల్‌లో స్థిరపడ్డ సిరిసిల్ల వాసి ప్రసాద్.. అక్కడకు కొత్తగా వచ్చిన తెలంగాణ ప్రాంత వాసులకు కొండంత ధైర్యం చెప్తున్నారు. యుద్ధ వాతావరణం నేపథ్యంలో ఎలా ఉండాలో, ఎక్కడ ఉండాలో సూచనలిస్తూ సహకరిస్తున్నారు.

నిద్ర కూడా సరిగా పడ్తలేదు

క్షిపణులు పడ్డప్పుడల్లా పెద్ద పెద్ద శబ్దాలు వస్తున్నాయి. దాంతో నిద్ర కూడా సరిగా పడ్తలేదు. 20 ఏండ్లలో ఇటువంటి వాతావరణం ఎప్పుడూ చూడలేదు. ఒక్కోసారి తినేటప్పుడే సైరన్లు వస్తుండటంతో తిండి పక్కనే పడేసి బంకర్లలోకి పరుగులు పెడుతున్నాం. - దేవరాజ్, కమ్మర్‌పల్లి వాసి

కొత్త పాన్ కార్డ్‌కు ఆధార్ తప్పనిసరి!

- జూలై 1 నుంచి అమలు

న్యూఢిల్లీ: మొదటిసారి కొత్తగా పాన్ కార్డ్ పొందడానికి ఆధార్ ధ్రువీకరణ తప్పనిసరి చేయాలని కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డ్ యోచిస్తున్నది. జూలై 1 నుంచి ఇది అమలు కావొచ్చని ఓ అధికారి తెలిపారు. 'డిజిటలైజేషన్ డ్రైవ్‌లో భాగంగా పన్ను దాఖలులో జవాబుదారీతనాన్ని, నిబద్ధతను పెంపొందించడానికి ఆధార్ ఆధారిత ధ్రువీకరణను ప్రవేశపెట్టాలనుకుంటున్నాం' అని ఓ సీనియర్ అధికారి చెప్పారు. జూలై 1 నుంచి పాన్ కార్డ్ దరఖాస్తుల కోసం ఆదాయపన్ను శాఖ తన పోర్టల్‌లో అవసరమైన కొత్త అంశాలను జోడించనుంది. పాత పాన్‌కార్డులున్న వారు తమ కార్డులను ఆధార్‌తో అనుసంధానం చేసుకోవడానికి ఈ ఏడాది డిసెంబర్ 31 వరకు కేంద్రం గడువు చ్చింది. ఆధార్‌తో అనుసంధానం కాని పాన్ కార్డులు వచ్చే ఏడాది నుంచి పని చేయవు.

సికిల్ సెల్‌కు ఔషధాన్ని అభివృద్ధి చేస్తే రూ.10 కోట్లు

- ప్రకటించిన కేంద్రం

న్యూఢిల్లీ: భారత్‌లోని గిరిజనుల్లో ఎక్కువగా వ్యాప్తి చెందుతున్న సికిల్ సెల్ వ్యాధి చికిత్సకు ఔషధాన్ని అభివృద్ధి చేసిన వారికి రూ.10 కోట్ల బహుమతి ఇవ్వనున్నట్టు కేంద్ర ప్రభుత్వం గురువారం ప్రకటించింది. ప్రపంచ సికిల్ సెల్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇక్కడ జరిగిన కార్యక్రమంలో కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ సహాయ మంత్రి దుర్గాదాస్ ఉయ్కే మాట్లాడుతూ ఈ వ్యాధికి చికిత్స చేయడానికి ఒక ఔషధాన్ని అభివృద్ధి చేసేందుకు భగవాన్ బిర్సా ముండా పేర బహుమతిని ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. ప్రస్తుతం ఈ వ్యాధి చికిత్సకు ఒకే ఒక్క ఔషధం అందుబాటులో ఉందని, రోగి వ్యాధి తీవ్రత, శారీరక లక్షణాలకు అనుగుణంగా ప్రత్యామ్నాయ ఔషధాన్ని ఎంచుకునే అవకాశం వైద్యులకు లేకుండా పోయిందన్నారు. ఈ వ్యాధి సోకిన గర్భిణులు, ఆరోగ్యం క్షీణించిన వారికి చికిత్స చేసేందుకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. అందవల్ల ఈ వ్యాధికి కొత్త ఔషధాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. దీంతో ఢిల్లీ ఏఐఐఎంఎస్ సహకారంతో గిరిజన శాఖ ఈ ఔషధ అభివృద్ధికి పోటీని నిర్వహిస్తున్నదని చెప్పారు.

అసమానతలు పరిష్కరించకుంటే..
అసలైన ప్రజాస్వామ్యం కాదు

- సీజేఐ బీఆర్ గవాయ్

న్యూఢిల్లీ: సమాజంలోని అసమానతలను పరిష్కరించకుండా ఏ దేశమూ నిజమైన ప్రగతిశీల లేదా ప్రజాస్వామ్యమైన దేశంగా చెప్పుకోలేదని సీజేఐ బీఆర్ గవాయ్ అన్నారు. దీర్ఘకాలిక స్థిరత్వం, సామాజిక ఐక్యత, సుస్థిరమైన అభివృద్ధిని సాధించడనానికి సామాజిక న్యాయం ఒక ఆచరణాత్మక అవసరమని ఆయన నొక్కి చెప్పారు. 'దేశంలో సామాజిక-ఆర్థిక న్యాయం అందించడంలో రాజ్యాంగం పాత్ర- 75 ఏండ్ల భారత రాజ్యాంగం నుంచి ప్రతిబింబాలు' అంశంపై బుధవారం మిలాన్‌లో జరిగిన ఒక సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఇది కేవలం పునర్విభజన లేదా సంక్షేమానికి సంబంధించిన విషయం కాదని, ప్రతి వ్యక్తి గౌరవంగా జీవించడానికి, దేశ, సామాజిక, రాజకీయ జీవితంలో సమానంగా పాల్గొనడానికి వీలు కల్పించడం గురించి కూడా అని ఆయన అన్నారు. రాజ్యాంగం ప్రజలకు దార్శనికత, నైతిక మార్గదర్శకాన్ని అందించిందని, చట్టం వాస్తవానికి సామాజిక మార్పుకు ఒక సాధనంగా, సాధికారతకు ఒక శక్తిగా, దుర్బల వర్గాలకు రక్షకుడిగా ఉంటుందని చూపించిందని సీజేఐ గవాయ్ పేర్కొన్నారు.

యుద్ధం నేను ఆపలేదు

- భారత్-పాక్ వార్‌పై ట్రంప్ యూటర్న్

న్యూయార్క్, ఇస్లామాబాద్, జూన్ 19: భారత్-పాకిస్థాన్ మధ్య యుద్ధాన్ని తానే ఆపానంటూ ఇప్పటికే పలుసార్లు ప్రకటించుకున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యూటర్న్ తీసుకున్నారు. భారత్, పాక్‌లకు చెందిన ఇద్దరు చాలా తెలివైన నాయకులు గత నెలలో జరిగిన సంఘర్షణను అణుయుద్ధంగా మార్చకుండా ముగించాలని నిర్ణయించుకున్నారని ట్రంప్ ప్రశంసించారు. శ్వేత సౌధంలో పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్‌తో బుధవారం విందు సమావేశం అనంతరం ఆయనీ వ్యాఖ్యలు చేశారు. కాగా, పహల్గాం దాడి తర్వాత ఇరు దేశాల మధ్య మే 7-10 మధ్య దాడులు, ప్రతిదాడులు జరిగాయి. తర్వాత హఠాత్తుగా కాల్పుల విరమణ జరిగింది. ఈ కాల్పుల విరమణకు తానే కారణమని, రెండు దేశాలకు మధ్యవర్తిత్వం వహించి అణుయుద్ధాన్ని నివారించి లక్షలాది మంది ప్రాణాలు కాపాడినట్టు ట్రంప్ ఇప్పటికే డజను సార్లకు పైగా బహిరంగంగా ప్రకటించారు. అయితే దానిని భారత్ ఖండిస్తూ వచ్చింది. కాగా, మునీర్‌ను కలవడం గౌరవంగా ఉందని, ప్రస్తుతం ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న యుద్ధం గురించి ఇరు దేశాల నేతలు చర్చించుకున్నామని ట్రంప్ చెప్పారు. కాగా, ఈ యుద్ధంలో అమెరికా కనుక నేరుగా రంగంలోకి దిగితే టెహ్రాన్‌పై దాడులు చేయడానికి ఆ దేశం పాకిస్థాన్ మిలిటరీ బేస్‌లను వాడుకుంటుందని, ఈ క్రమంలోనే మునీర్‌తో చర్చలు జరిగినట్టు ప్రచారం జరుగుతున్నది. కాగా, మునీర్‌కు ట్రంప్ విందు ఇవ్వడం దౌత్య వైఫల్యమేనని కేంద్రంపై కాంగ్రెస్ మండిపడింది.

బ్లాక్‌బాక్స్ డీకోడ్‌పై ఏఏఐబీదే నిర్ణయం: కేంద్రం

న్యూఢిల్లీ: గత వారం అహ్మదాబాద్‌లో కూలిపోయిన ఎయిరిండియా విమానం బ్లాక్ బాక్స్ బాగా దెబ్బతినడంతో దాన్ని డీ కోడ్ చేయడానికి అమెరికాకు పంపుతున్నట్టు వచ్చిన వార్తలను కేంద్ర ప్రభుత్వం తోసిపుచ్చింది. దాన్ని ఎక్కడ డీకోడ్ చేయాలన్నది ఎయిర్‌క్రాఫ్ట్స్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) నిర్ణయిస్తుందని తెలిపింది. సేఫ్టీ, సెక్యూరిటీ, సాంకేతిక అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకుంటుందని పేర్కొన్నది. ప్రమాద ఘటనపై ఏఏఐబీ నిపుణుల బృందం దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపింది. కాగా, బ్లాక్‌బాక్స్ డాటా రికవరీ కోసం అమెరికాకు పంపించనున్నట్టు తొలుత వార్తలు వచ్చాయి.

భారత్‌లో ఐఐటీ ఢిల్లీనే టాప్

- క్యూఎస్ ర్యాంకింగ్స్‌లో 123వ స్థానం సాధించిన వర్సిటీ
- టాప్ 200లో మరో రెండు విద్యాసంస్థలు మాత్రమే

న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా ఉన్న బెస్ట్ యూనివర్సిటీల జాబితాను క్యూఎస్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్-2026 ద్వారా ప్రకటించింది. ఇందులో భారత్‌కు చెందిన 54 యూనివర్సిటీలకు చోటు దక్కింది. 2014లో కేవలం 11 యూనివర్సిటీలకు మాత్రమే ఈ లిస్టులో కనిపించగా, ఈ సారి వాటి సంఖ్య గణనీయంగా పెరిగింది. యూఎస్, యూకే, చైనా తర్వాత నాలుగో స్థానంలో భారత్ నిలిచింది. కాగా, ఈ సారి 200లోపు ర్యాంకింగ్స్‌లో భారత్‌కు చెందిన యూనివర్సిటీలు మూడే ఉన్నాయి. ఐఐటీ ఢిల్లీ, ఐఐటీ బాంబే, ఐఐటీ మద్రాస్ టాప్ 200లో నిలిచాయి. ఐఐటీ ఢిల్లీ గతేడాది సాధించిన 150వ స్థానం నుంచి 123 స్థానానికి ఎగబాకింది. ఐఐటీ బాంబే మాత్రం గతేడాది ర్యాంక్ 118 నుంచి 129వ స్థానానికి చేరుకుంది. ఇక ఐఐటీ మద్రాస్ 180వ ర్యాంక్ సాధించింది. ఇక యూఎస్‌లోని మాసచుస్ట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వరుసగా పద్నాలుగోసారి మొదటి ర్యాంక్‌ను సాధించింది. లండన్‌లోని ఇంపీరియల్ కాలేజీ రెండోస్థానం, యూఎస్‌లోని స్టాన్‌ఫర్డ్ వర్సిటీ మూడో స్థానంలో నిలిచాయి.

స్పైస్ జెట్ విమానంలో సాంకేతిక లోపం

- హైదరాబాద్ నుంచి తిరుపతి వెళ్తుండగా ఘటన

హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ నుంచి తిరుపతికి వెళ్తున్న స్పైస్ జెట్ విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. గురువారం ఉదయం విమానం టేకాఫ్ అయిన 10 నిమిషాలకే సాంకేతిక సమస్యను పైలట్లు గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన పైలట్లు విమానాన్ని హైదరాబాద్‌కు మళ్లించారు. ఘటన జరిగిన సమయంలో 80 మంది ప్రయాణికులు విమానంలో ఉన్నట్టు తెలిసింది. తిరుపతికి వెళ్లాల్సిన ఫ్లయిట్ తిరిగి హైదరాబాద్‌కు రావడంతో ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. ప్రయాణికులంతా సురక్షితంగా ఉన్నట్టు స్పైస్ జెట్ ఓ ప్రకటనలో వెల్లడించింది. ప్రయాణికులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్టు పేర్కొంది.

లెహ్‌కు వెళ్తున్న విమానంలోనూ..

ఢిల్లీ నుంచి లెహ్‌కు వెళ్తున్న ఇండిగో విమానంలోనూ సాంకేతిక సమస్య తలెత్తడంతో విమానం తిరిగి ఢిల్లీకి చేరుకున్నది. ఇండిగో ఫ్లైట్ 6ఈ 2006 విమానంలో ఈ సమస్య తలెత్తిందని, ప్రయాణికులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్టు ఇండిగో అధికార ప్రతినిధి ఒకరు తెలిపారు.

ఇంధనం కొరతతో..

ఇంధన కొరత కారణంగా గువాహటి నుంచి చెన్నై వెళ్తున్న ఇండిగో విమానాన్ని బెంగళూరుకు మళ్లించారు. రాత్రి 7.45 గంటలకు ఈ విమానం చెన్నైకి చేరుకోవాల్సి ఉంది. అయితే ఇంధనం తక్కువగా ఉండటంతో చెన్నై గగనతంలోకి వచ్చిన తర్వాత విమానాన్ని బెంగళూరు ఎయిర్‌పోర్టుకు మళ్లించారు.

16 అంతర్జాతీయ రూట్లలో
సర్వీసులు నిలిపివేత
ఎయిరిండియా ప్రకటన

ముంబై, జూన్ 19: ఈనెల 21 నుంచి జూలై 15 మధ్య 16 అంతర్జాతీయ రూట్లలో విమాన సర్వీసులను తగ్గిస్తున్నామని, 3 విదేశీ గమ్యస్థానాలను నిలిపివేస్తున్నామని ఎయిరిండియా గురువారం ప్రకటించింది. ఈనెల 12న అహ్మదాబాద్‌లో ఘోర విమాన ప్రమాదం తర్వాత పలు విమాన సర్వీసులలో అంతరాయం ఏర్పడిన నేపథ్యంలో షెడ్యూలులో స్థిరత్వాన్ని పునరుద్ధరించి ప్రయాణికులకు చివరి నిమిషంలో అసౌకర్యాన్ని నివారించే లక్ష్యంతో ఈ చర్యలు చేపట్టినట్లు టాటా గ్రూపు యాజమాన్యంలోని ఎయిరిండియా పేర్కొంది. భారీ సైజు విమానాలతో నిర్వహించే సర్వీసులను 15 శాతం తగ్గించనున్నట్లు తెలిపింది. జూన్ 21న ప్రారంభమై జూలై 15న ఈ విమాన సర్వీసు తగ్గింపులు ముగుస్తాయని ఎయిరిండియా పేర్కొంది. ఢిల్లీ-నైరోబి, అమృత్‌సర్-లండన్(గాట్విక్), గోవా(మోపా)-లండన్(గాట్విక్) మధ్య విమాన సర్వీసులు జూలై 15 వరకు నిలిపివేస్తున్నట్లు వివరించింది. ఉత్తర అమెరికా, యూరప్, ఆస్ట్రేలియా, ఆగ్నేయాసియాలోని నగరాలను కలిపే 16 అంతర్జాతీయ మార్గాలలో కూడా విమాన సర్వీసులను తగ్గనున్నట్లు ఎయిరిండియా తెలిపింది.

జస్టిస్ వర్మ ఇంట్లో నోట్ల గుట్టలు నిజమే

నిర్ధారించిన త్రిసభ్య విచారణ కమిటీ

విధుల నుంచి తొలగించాలని సిఫార్సు

న్యూఢిల్లీ: ఢిల్లీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ వర్మ ఇంట్లో భారీగా నోట్ల కట్టలు ఉన్నమాట వాస్తమేనని, ఆయనను విధుల నుంచి తొలగించాలని సుప్రీంకోర్టు నియమించిన త్రిసభ్య కమిటీ సిఫార్సు చేసింది. జస్టిస్ వర్మ నివసిస్తున్న తుగ్లక్ క్రీసెంట్‌లోని అధికారిక గృహంలో మార్చి 14 రాత్రి అగ్నిప్రమాదం జరిగింది. మంటలను ఆర్పడానికి వెళ్లిన అగ్నిమాపక, పోలీసులకు ప్రమాదం జరిగిన స్టోర్ రూమ్‌లో పెద్దయెత్తున నోట్ల కట్టలు కన్పించాయి. అందులో కొన్ని కాలిపోయాయి. ఆ నోట్ల గురించి తనకేమీ తెలియదని, అవి తనవి కావని వర్మ బుకాయించారు. దీనిపై పెద్దయెత్తున మీడియాలో ప్రచారం జరగడంతో కలుగజేసుకున్న సుప్రీం కోర్టు ఆయనను వెంటనే అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేసి, ఆయనపై విచారణకు త్రిసభ్య కమిటీని నియమించింది. పంజాబ్ హర్యానా హైకోర్టు చీఫ్ జస్టిస్ నేతృత్వంలోని ముగ్గురు న్యాయమూర్తుల ప్యానెల్ 10 రోజుల పాటు ఈ విచారణ నిర్వహించింది. ఒక సాధారణ అగ్నిప్రమాదంలా ప్రారంభమైన ఈ సంఘటన ఇప్పుడు న్యాయవ్యవస్థ దుష్ప్రవర్తన, ప్రజల విశ్వాస ఉల్లంఘన అనే అంశాలపై చర్చకు దారితీసింది. తాజాగా ఈ కమిటీ విచారణను పూర్తి చేసి సుప్రీంకోర్టుకు తన నివేదికను సమర్పించింది. నోట్ల కట్టల వ్యవహారంలో జస్టిస్ వర్మ, అతని కుటుంబ సభ్యుల ప్రమేయం ఉందని తన నివేదికలో నిర్ధారించింది.

ఇంత జరిగినా వర్మ ఫిర్యాదు చేయలేదు

జస్టిస్ వర్మ నివాస గృహంలో పెద్దయెత్తున నోట్ల కట్టలు ఉన్నట్టు పలువురు ప్రత్యక్ష సాక్షులు స్పష్టం చేశారని, దీనికి దృశ్య ఆధారాలు కూడా ఉన్నాయని కమిటీ తెలిపింది. కానీ జస్టిస్ వర్మ ఎప్పుడూ పోలీసులకు ఫిర్యాదు చేయడం కానీ, న్యాయశాఖ అధికారులకు తెలియజేయడం కానీ చేయలేదని విచారణ కమిటీ పేర్కొంది. ఈ విషయంలో జస్టిస్ వర్మ ప్రవర్తన అసహజంగా ఉందని పేర్కొంటూ ఆయనను విధుల నుంచి తొలగించాలని సిఫార్సు చేసింది.

ఆమోదయోగ్యమైన వివరణ ఇవ్వలేదు..

తమ కమిటీ జస్టిస్ వర్మ కుమార్తె సహా 55 మంది సాక్షులను విచారించిందని, స్టోర్ రూమ్ నేలపై చెల్లాచెదురుగా పెద్దయెత్తున పడి ఉన్న 500 నోట్ల కట్టలు ఉన్నట్టు వీడియోలు, ఫొటోలు వంటి ధ్రువీకరించే సాక్ష్యాలు అగ్నిమాపక, పోలీస్ శాఖల నుంచి సేకరించిందని కమిటీ తెలిపింది. తన ఇంట్లో అంత పెద్దయెత్తున నోట్ల కట్టలు ఎందుకు ఉన్నాయన్న దానిపై ఆయన ఆమోదయోగ్యమైన వివరణ ఇవ్వలేదని, ఆ నోట్ల గురించి తనకు తెలియదనడం నమ్మశక్యంగా లేదని కమిటీ పేర్కొంది. ఒక వేళ ఈ విషయంలో ఆయనపై కుట్ర కనుక జరిగితే జస్టిస్ వర్మ భారత ప్రధాన న్యాయమూర్తికి ఎందుకు ఫిర్యాదు చేయలేదని కమిటీ ప్రశ్నించింది. మంటలను ఆర్పివేసిన తర్వాత స్టోర్ రూమ్‌ను శుభ్రం చేసి, ఆధారాలు లేకుండా చేసిన వారిలో వర్మ కుమార్తె, ఆయన ప్రైవేట్ కార్యదర్శి రాజేందర్ సింగ్ కర్కి ప్రమేయం ఉండొచ్చని కమిటీ అనుమానం వ్యక్తం చేసింది. వర్మపై ఆ ఆరోపణలు వచ్చిన తర్వాత ఆయనను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేసిన సీజేఐ ఆయనకు ఎలాంటి న్యాయ విధులను అప్పగించ లేదు. కాగా, తనపై విచారణ జరుగుతున్న క్రమంలో వర్మ తన పదవికి రాజీనామా చేయలేదు.

పేలిన స్పేస్‌ఎక్స్ రాకెట్

ఆస్టిన్: టెక్సాస్‌లో బుధవారం రాత్రి స్పేస్ ఎక్స్ పరీక్షిస్తున్న రాకెట్ ఒకటి ఆకాశంలో పేలిపోయింది. స్టార్ బేస్‌లో తమ స్టార్ షిప్ పదో ఫ్లైట్ టెస్ట్ స్టాండ్‌ను సిద్ధం చేస్తున్నప్పుడు రాత్రి 11 గంటల సమయంలో 'ఒక అసాధారణ పరిస్థితిని' ఎదుర్కొన్నామని స్పేస్ ఎక్స్ ప్రమాదం గురించి తెలిపింది. ఈ ప్రమాదంలో ఎవరూ గాయపడలేదని ఆ సంస్థ సీఈవో ఎలాన్ మస్క్ తెలిపారు. ప్రయోగ ప్రాంతంలో, దాని చుట్టు పక్కల ప్రాంతాల్లో తగిన భద్రతా చర్యలు చేపట్టామని ఎక్స్‌లో ఆ సంస్థ ట్వీట్ చేసింది.

ఇంగ్లీష్ మాట్లాడే వారు సిగ్గుపడతారు!

- దేశంలో అలాంటి సమాజం ఏర్పడే రోజు దగ్గర్లోనే ఉంది
- 'హిందీ భాషా వివాదం' నేపథ్యంలో అమిత్‌షా వ్యాఖ్య

న్యూఢిల్లీ, జూన్ 19: ఇంగ్లిష్ మాట్లాడేవాళ్లు త్వరలోనే సిగ్గుపడతారని, దేశంలో అలాంటి సమాజం ఏర్పడే రోజు దగ్గరలోనే ఉందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా సంచలన వ్యాఖ్యలు చేశారు. భారతీయ భాషలే దేశ గుర్తింపునకు కేంద్రంగా ఉంటాయని, అందుకే ఇంగ్లిష్ కంటే వాటికే ఎక్కువగా ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. ఢిల్లీలో ఓ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న అమిత్‌షా మాట్లాడుతూ 'బ్రిటిష్ వలస పాలనలోని బానిసత్వానికి చిహ్నంగా ఇంగ్లిష్‌ను చ